జస్టిస్ ప్రియదర్శినికి న్యాయమూర్తుల నివాళి

వరంగల్ లీగల్, మే 5 : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శినికి వరంగల్ జ్యుడీషియల్ యూనిట్ న్యాయమూర్తులు, న్యాయ శాఖ ఉద్యోగులు నివాళులర్పించారు. సోమవారం కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సంతాప సభలో హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పట్టాభి రామారావు, వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియదర్శినితో కలిసి విధులు నిర్వర్తించిన న్యాయమూర్తి పట్టాభి రామారావు మాట్లాడుతూ.. జస్టిస్ ప్రియదర్శిని ఎక్కడ పనిచేసినా సమయపాలన తప్పకుండా పాటించాలని సహచర న్యాయమూర్తులకు చెప్పేవారన్నారు. వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఉద్యోగులు, కక్షిదారులతో ఎంతో సౌమ్యంగా వ్యవహరించే వారు అని అన్నారు. హనుమకొండ జిల్లా అదనపు జడ్జి అపర్ణాదేవి, న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాలడుగుల బుజ్జిబాబు ఆమె మృతికి సంతాపంగా మౌనం పాటించి నివాళులర్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు సోమవారం కోర్టు విధులకు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించి దివంగత న్యాయమూర్తిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

గ్రామీణ అభివృద్ధికి కృత్రిమ మేధ ఉపయోగపడాలి

హనుమకొండ చౌరస్తా, మే 5 : గ్రామీణ దేశాభివృద్ధికి కృత్రిమ మేధ ఉపయోగపడాలని వరంగల్ కిట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కాలేజీ (కో ఎడ్యుకేషన్), వరంగల్ నిట్ సహకారంతో నిర్వహిస్తున్న 'ఏఐ, మెషిన్ లెర్నింగ్ సెమీకండక్టర్ టెక్నాలజీలలో తాజా పరిశోధన ధోరణులు' అనే అంశంపై 16వ తేదీ వరకు సదస్సు జరుగనుంది. ఆచరణాత్మక సామాజిక సవాళ్లను పరిష్కరించడానికి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను ఏకీకృతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

ప్రపంచ గమనాన్ని మార్చిన కారల్ మార్క్స్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ, మే 5 : పెట్టుబడిదారుల శ్రమ దోపిడీ కుట్రలను ఎత్తిచూపి ప్రపంచ గమనాన్ని మార్చిన సిద్ధాంతం మార్క్సిజమని, ఆ సిద్ధాంత రూపకర్త కారల్ మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కారల్ మార్క్స్ 207వ జయంతి వేడుకలు నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు స్టాలిన్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొడుగు వెంకట్ అధ్యక్షతన హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సాదుల శ్రీనివాస్ మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాజంలో దోపిడీ, పీడన, అసమానతలకు కారణమైన పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. జిల్లా నాయకులు సూర్నపు సోమయ్య, బొట్ల చక్రపాణి, రాగుల రమేశ్, వాంకుడోత్ వీరన్న పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ టాయ్‌లెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

టాయ్‌లెట్‌లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్త, సామగ్రి

హనుమకొండ, మే 5 : దివ్యాంగుల హక్కుల చట్టం దివ్యాంగుల కోసం అనేక ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని సూచిస్తున్నప్పటికీ అది ఎక్కడా అమలు కావడం లేదని దివ్యాంగుల సామాజిక వేదిక వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ అన్నారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో దివ్యాంగులకు భౌతిక వసతులతో కూడిన వాతావరణం కల్పించాలని జీవో నంబర్ 30 చెబుతున్నదని, దానిలో భాగంగా కలెక్టరేట్, గ్రౌండ్ ఫ్లోర్‌లో దివ్యాంగుల కోసం నిర్మించిన ఫ్రెండ్లీ టాయ్‌లెట్‌ను వినియోగంలోకి తీసుకురాకుండా, దాన్ని స్టోర్ రూమ్‌గా మార్చి పనికి రాని చెత్త వేయడం దివ్యాంగులపై నిర్లక్ష్య ధోరణి తెలియజేస్తున్నదన్నారు. దీంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కలెక్టర్ వెంటనే చొరవ తీసుకొని ఫ్రెండ్లీ టాయ్‌లెట్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

సమస్యలతో వచ్చాం.. పరిష్కరించండి

- గ్రీవెన్స్‌లో బాధితుల మొర
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- వివిధ సమస్యలపై 143 వినతులు

బాధితుల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

హనుమకొండ, మే 5 : సమస్యలతో వచ్చాం.. పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజలు విన్నవించుకున్నారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ప్రావీణ్యకు ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ప్రజలు 143 వినతులు అందజేసినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై 64, జీడబ్ల్యూఎంసీ 14, హౌసింగ్ 13, డీపీవో 5, వ్యవసాయం, డీఎంహెచ్‌వో, డీఈవోకు సంబంధించి నాలుగు చొప్పున వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్ పాల్గొన్నారు.

ఫించన్ ఇప్పించండి మహా ప్రభో..

– సిద్దిరాల కార్తీక్, కాజీపేట, రహమత్‌నగర్

మూడు సంవత్సరాలుగా దివ్యాంగుల పింఛన్ కోసం తిరుగుతున్నా. ఇప్పంచండి మహా ప్రభో అని కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన సిద్దిరాల కార్తీక్(8) అతడి తాత పరమేశ్వర్‌తో కలెక్టరేట్‌కు వచ్చి మొరపెట్టుకున్నాడు. పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడైన కార్తీక్‌కు వెన్నెముక పనిచేయడం లేదు. దీంతో నిటారుగా నిలబడడం, కూర్చోలేని పరిస్థితి. కేవలం మూడు చక్రాల సైకిల్‌కే పరిమితమయ్యాడు. మాటలు రావు. తండ్రి అనిల్ కుమార్‌కు వాహన ప్రమాదంలో తలకు గాయమై మతిస్థిమితం లేకుండా పోయింది. వీరిద్దరి పరిస్థితిని చూసి కార్తీక్ తల్లి పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రస్తుతం కొడుకు, మనమడి బాగోగులు తాతే చూసుకుంటున్నాడు. ఓ కాంట్రాక్టర్ వద్ద గుమస్తాగా పనిచేసుకుంటూ వీరిని సాకుతున్నాడు. కిరాయి ఇంట్లో ఉంటున్నారు. మా కుటుంబ పరిస్థితి దృష్ట్యా మనమడు కార్తీక్‌కు ఫించన్ ఇప్పించి జీవనోపాధి చూపించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నట్లు తెలిపారు.

రాజీవ్ యువశక్తి ద్వారా రుణం ఇప్పించండి..

– అమిరిశెట్టి రాజ్‌కుమార్, కొత్తకొండ, భీమదేవరపల్లి

దివ్యాంగుడినైన నాకు రాజీవ్ యువశక్తి పథకం ద్వారా రుణం ఇప్పించి జీవనోపాధి కల్పించాలి. పదో తరగతి వరకు చదువుకున్నాను. ప్రస్తుతం ఫ్రూట్ షాప్ నడిపించుకుంటున్నాను. షాపు సరిగ్గా నడవక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాను. రుణం ఇప్పించి సహకరించాలి.

జిమ్‌ను పునఃప్రారంభించాలి..

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని మల్టీ జిమ్‌ను పునఃప్రారంభించాలని ఎవర్‌గ్రీన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్త పరికరాలతో జిమ్ ఏర్పాటు చేసి త్వరగా ప్రారంభించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో చంద్రశేఖర్, దస్తగిరి, బూచయ్య, చీకటి రాజు ఉన్నారు.

కొడుకులు సాకడం లేదు..

– చందరాజు నారాయణ దంపతులు, రాంపూర్

వృద్ధాప్యంలో కొడుకులు సాకడం లేదు. ఇబ్బందులు పెడుతున్నారు. నాకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. అందరికీ పెళ్లిళ్లు చేశాను. నా పేరున ఉన్న భూమి అంతా కుమారులు బెదిరించి వారి పేరుపై చేయించుకున్నారు. నా పేరుపై ఎలాంటి ఆస్తులు లేదు. వారు పెద్ద పెద్ద ఇండ్లల్లో ఉంటూ మమ్ములను చిన్న రేకుల షెడ్డులో ఉంచారు. మా బాగోగులు చూడకపోవడంతో పాటు కొట్టడం, తిట్టడం చేస్తున్నారని బోరున విలపించారు. కొడుకుల నుంచి మాకు ప్రాణహాని ఉంది. కుమారుల పేరుపై చేయించుకున్న ఆస్తిని మా పేరుపై మార్పించి రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరికి గాయాలు

మడికొండ, మే 5 : మడికొండ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో విలేకరికి తీవ్ర గాయాలయ్యాయి. మడికొండ ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన పెసరు ఆగయ్య ఓ దినపత్రికలో రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం జానకీపురం నుంచి ధర్మసాగర్ మీదుగా మడికొండకు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో రింగ్‌రోడ్డు వద్ద ఓ లారీ బైకును ఢీకొన్నది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన ఆగయ్యను 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు.

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ

హనుమకొండ చౌరస్తా, మే 5 : ఈ వేసవి సెలవుల్లో అన్నిస్థాయిల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు డీఈవో వాసంతి తెలిపారు. కాజీపేట ఫాతిమా నగర్ బాలవికాసలో జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్లకు నిర్వహించనున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి గణితంలో 139 మంది, సాంఘికశాస్త్రంలో 139 మంది రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. ఇన్‌చార్జి గణపతిశర్మ, ఎల్లయ్య, స్టేట్ రిసోర్స్‌పర్సన్లు రమేశ్, రామయ్య, జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఎంఈవో మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

హైదరాబాద్ వాసి కాజీపేటలో అదృశ్యం

కాజీపేట, మే 5 : హైదరాబాద్‌కు చెందిన ఓ వృద్ధుడు కాజీపేటలో అదృశ్యమయ్యాడు. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, నాగోల్‌కు చెందిన మండలోజు వెంకటేశ్వర్లు (70) 20 రోజుల క్రితం దర్గా కాజీపేట రోడ్డులో ఉంటున్న కూతురు ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం 5 గంటలకు వెంకటేశ్వర్లు ఇంటి నుంచి బయటికి వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో అల్లుడు ముడుపు హరీశ్ మామ వెంకటేశ్వర్లు కోసం పట్టణమంతా వెదికాడు. ఆచూకీ తెలియక పోవడంతో కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, మే 5 : రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. సోమవారం మండలంలోని నర్సింహులగూడెంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిదాలయం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉత్తమ పద్ధతులను పాటించి సాగు చేస్తున్న రైతులను సన్మానించారు. అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఉమారెడ్డి, శాస్త్రవేత్తలు అనూష, నందిని, అశ్విని, జిల్లా వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడిగా ఉస్మాన్‌అలీ

ఐనవోలు, మే 5 : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడిగా జడ్పీ కో ఆప్షన్ మాజీ మెంబర్, మాజీ సర్పంచ్ షేక్ ఉస్మాన్ అలీని నియమించారు. ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ అలీకి నియామక పత్రం అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర చైర్మన్‌తో పాటు ఉమ్మడి జిల్లా చైర్మన్ నందగిరి రజినీకాంత్, అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లకు ఉస్మాన్‌అలీ కృతజ్ఞతలు తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం

సుబేదారి, మే 5 : గతేడాది మృతిచెందిన కానిస్టేబుల్ కుటుంబానికి సహోద్యోగులు ఆర్థికసాయం చేశారు. 2013 బ్యాచ్‌కు చెందిన బండారి కిరణ్‌కుమార్ గతేడాది నవంబర్ 16న మరణించారు. అతడి కుటుంబానికి ఆ బ్యాచ్‌కు చెందిన వరంగల్ పోలీసు కమిషనరేట్, అదిలాబాద్ జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు రూ. 2.50లక్షల విలువైన చెక్, ఇంటి అవసరాలకు రూ.37వేల నగదును సోమవారం హనుమకొండలోని సీసీ కార్యాలయంలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ వినతులను తక్షణమే పరిష్కరించాలి

- టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులపై శ్రద్ధ చూపాలి
- గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బల్దియాలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 5 : గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్‌లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 66వ డివిజన్ హసన్‌పర్తిలోని ఆదర్శ కాలనీలో రహదారికి అడ్డంగా కుక్కల చంద్రమౌళి అనే వ్యక్తి ప్రహరీ నిర్మిస్తున్నాడని, కాలనీవాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వినతిపత్రం అందజేశారు. 43వ డివిజన్ రహమత్ నగర్‌లో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని, జవాన్ రవికి చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని న్యూ కాకతీయ హిల్స్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. గణేశ్‌నగర్ కాలనీలో నాలుగు నెలలుగా తాగునీటి సరఫరా కావడం లేదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. 12వ డివిజన్ మార్కండేయ కాలనీ (మంగలికుంట)లో 50 రోజులుగా తాగునీటి సరఫరా కావడం లేదని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 43వ డివిజన్ బెస్తం చెరువు ప్రాంతంలో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని, ఫాగింగ్ చేయడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. వరంగల్ పాతబీటు బజార్‌లోని విజయ అపార్ట్‌మెంట్‌లో హరిరాం చవాన్ అండ్ బ్రదర్స్ షెడ్లు నిర్మిస్తున్నారని, వాటిని తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని అపార్ట్‌మెంట్ కమిటీ ఫిర్యాదు చేసింది. 18వ డివిజన్ క్రిష్టియన్ కాలనీ, శాలినీ నగర్‌లోని క్రిష్టియన్, హిందూ శ్మశాన వాటికలు దురాక్రమణకు గురవుతున్నాయని, పరిరక్షించాలని బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ.. గ్రేటర్‌లోని చెరువుల్లో వెంటనే పూడికతీత పనులు ప్రారంభించాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో 101 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 44, ఇంజినీరింగ్ విభాగం 28, ప్రజారోగ్య విభాగం 11, పన్నుల విభాగం 9, తాగునీటి సరఫరా 7, హార్టికల్చర్ 1, సాధారణ విభాగానికి ఒక వినతి వచ్చింది. గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ జోనా, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర లింగం, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు..

వరంగల్ : ఆల్ ట్రేడ్ యూనియన్ పిలుపులో భాగంగా దేశ వ్యాప్తంగా మే 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు మున్సిపల్ కార్మికులు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు సమ్మె నోటీసు అందజేశారు. సోమవారం ఆమెను కలిసి కార్మిక సంఘాల నాయకులు సమ్మెలో పాల్గొంటున్నామని చెప్పారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మిక సంఘాల నాయకులు కాసుమాధవి, జన్ను ప్రకాశ్, సాంబయ్య, సింగారపు కృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఐలోని హుండీ ఆదాయం రూ.31.89లక్షలు

ఐనవోలు, మే 5 : ఐనవోలు మల్లికార్జునస్వామి హుండీ ఆదాయం సోమవారం లెక్కించినటు ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. 37 రోజులకు 23 హుండీలను లెక్కించగా రూ. 6,07, 555 వచ్చింది. టికెట్ల ద్వారా రూ. 25,81,944 సమకూరింది. మొత్తం ఆదాయం రూ.31,89,499 వచ్చింది. అనిల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్‌రెడ్డి, కానిస్టేబుల్ పరమేశ్వరి పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

నడికూడ, మే 5 : మండలంలోని చౌటుపర్తి, ధర్మారం గ్రామాల్లో సోమవారం భూ భారతి చట్టం –2025 రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంగీలాల్, ఆర్డీవో నారాయణ, ఆర్ఐ సృజన్ కుమార్, శంకర్ పాల్గొన్నారు.

నిట్‌లో బేర్‌ఫుట్ కౌన్సెలింగ్‌పై శిక్షణ

హనుమకొండ చౌరస్తా, మే 5 : ఎన్ఐటీలో అధ్యాపకుల కోసం రెండు రోజుల బేర్ ఫుట్ కౌన్సెలింగ్ శిక్షణ శిబిరాన్ని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ఎక్స్‌ప్రెషన్స్ ఇండియా ఢిల్లీకి చెందిన ప్రముఖ నిపుణులు జితేంద్ర నాగపాల్, గీతా మెహోత్రా, హైదరాబాద్‌కు చెందిన మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య, అనంత మాధవ మోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఎన్ఐటీ హైదరాబాద్‌లోని హార్ట్ ఫుల్‌నెస్ సెంటర్‌తో ఉన్న అవగాహన ఒప్పందాన్ని పునరుద్ధరించింది. ఈ ఒప్పందం ప్రకారం ఈ సెంటర్ విద్యార్థులకు పాజిటివ్ మైండ్‌సెట్‌పై ప్రత్యేకమైన కోర్సును అందించనుంది.

చలివేంద్రం షెడ్డు సరే.. నీటి సౌకర్యం ఎప్పుడో?

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం షెడ్డు

హనుమకొండ, మే 5 : కలెక్టరేట్‌లో అధికారులు చలివేంద్రం షెడ్డు ఏర్పాటు చేశారు కానీ నీళ్లు మాత్రం అందుబాటులోకి తేలేదు. గ్రీవెన్స్‌తో పాటు వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా చలివేంద్రంలో చల్లటి నీరు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

హసన్‌పర్తి, మే 5 : చదువుకున్న పాఠశాలలను పూర్వ విద్యార్థులు అభివృద్ధి చేయాలని నల్సార్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కృష్ణ దేవరాయులు సూచించారు. భీమారంలోని వీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ధర్మసాగర్ మండలంలోని పెద్ద పెండ్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో 1974–75 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి, వైస్ చాన్స్‌లర్ కృష్ణదేవరాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు వయసును పక్కన బెట్టి ఆత్మీయ సమ్మేళనాకి హాజరు కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మామిడాల సురేందర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఉపేందర్ పాల్గొన్నారు.

డీఈఈ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, మే 5 : డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో ప్రభుత్వ, ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ (మైనార్టీ, నాన్ మైనార్టీ) సంస్థల్లో ప్రవేశాలకు సంబంధించి షెడ్యూల్ విడుదలైనట్లు ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, దీనికి సంబంధించి ఎడిట్ ఆప్షన్ ఈ నెల 17, 18వ తేదీల్లో చేసుకోవచ్చన్నారు. 20న హాల్ టికెట్లు, ప్రవేశ పరీక్ష ఈ నెల 25న నిర్వహిస్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన అశోక్

అశోక్‌కు స్వీట్లు ఇస్తున్న ఎమ్మెల్సీ కవిత

శాయంపేట, మే 5 : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జాగృతి రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ సోమవారం తన పుట్టినరోజు సందర్భంగా కలిశారు. బొకే అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. అశోక్‌కు స్వీట్ తినిపించి ఎమ్మెల్సీ సన్మానించారు.

15 మంది రక్తదానం..

మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు అశోక్ పుట్టిన రోజు సందర్భంగా జాగృతి మండల నాయకుడు మూల మనోజ్ ఆధ్వర్యంలో సోమవారం పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో 15 మంది రక్తదానం చేశారు. వీరికి ఆస్పత్రి అధికారులు సర్టిఫికెట్లను అందజేశారు. చిట్టి శ్రీనివాస్, కుమారస్వామి, మనోజ్, కుక్కల రాజు, అబ్బు తిరుపతిరెడ్డి, చంద విజేందర్, నితీశ్, రాజు పాల్గొన్నారు.

9న కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు

హనుమకొండ చౌరస్తా, మే 5 : ఈ నెల 9న జేఎన్ఎస్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ కబడ్డీ క్యాంపు, ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం శిక్షణ కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరగడం అభినందనీయం

కాజీపేట, మే 5 : రాష్ట్రంలో మాదిగ జాతి బిడ్డల సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ జరిగిందని, ప్రభుత్వం వర్గీకరణ చేపట్టడం అభినందనీయమని మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు చిట్టిపాక ప్రభాకర్ అన్నారు. కాజీపేట పట్టణం బాపూజీనగర్‌లో సమితి రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల విల్సన్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఎడ్ల ఉపేందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాల్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

ఆత్మకూరు, మే 5 : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేశ్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మావోయిస్టులతో చర్చలు జరిపేది లేదని మాట్లాడుతున్న బండి సంజయ్ వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కర్రెగుట్టల నుంచి పోలీస్ బలగాలను వెనక్కి రప్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు కుమార్, పైడి, అశోక్‌యాదవ్, పవన్ యాదవ్, స్వామి, మొగిలి, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

కేయూలో శాంతి ర్యాలీ..

హనుమకొండ చౌరస్తా : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టు నాయకులతో కేంద్రం చర్చలు చేపట్టాలని వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఆఫీస్ నుంచి కేయూ మొదటి గేటు వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. రిటైర్డ్ టీచర